
మహా సముద్రంలో ఈది యీది అలిసిపోయినట్టుగా వుంది నా పరిస్థితి. ఒకటా, రెండా, ముప్పై సంవత్సరాల జీవన పోరాటం. ఈ మహానగరంలోని రైలు ప్రయాణ జన సందోహంలో రోజూ అటు ఇటు కలిపితేసమారు అరవై కిలోమీటర్లు.

ఈ ప్రయాణంలోనే సగం జీవితం గడిచిపోయినట్టుగా వుంది. ఇప్పుడెంతో మేలు.ఆ రోజుల్లో - అంటే నూనూగు మీసాల మాత్న యవ్వనంలోకి నేను అడుగుపెట్టినప్పుడు ఈ ఎలక్ట్రిక్ ట్రైన్లేవీ? అన్నీ పొగబళ్ళే ఈ రూటులో. తిన్నన్నూరు నించి మద్రాస్ సెంట్రల్‌కి దాదాపు ఒకటిన్నర గంటకి పైగానే అయ్యేది. అక్కణ్ణించి ఆఫీసుకి సిటీ బస్సులో మరో రెండు మైళ్ళు.

పద్దెనిమిదేళ్ళకే వుద్యోగంలో చేరిన నాకు రోజూ ఇంత దూరం ప్రయాణం చేయాలంటే ప్రాణానికొచ్చినట్టుండేది.కాని తప్పదుగా ఈ జీవన సమరం. సిటీలో అద్దె కొంప దొరకడమంటే ఆ రోజుల్లో కూడా మాటలేం కాదు. అప్పుడు నాకొచ్చే జీతానికి ఆ ముప్పై రూపాయిల బాడుగే ఎక్కువనిపించింది. అందుకే తిన్నన్నూరు వొదిలి ఎక్కడికీ కదలం అన్నారు మావాళ్ళు. సరే! ఉద్యోగం, ఆ తర్వాత పెళ్ళి పెటాకులు, పిల్లామేక అదంతా పాతకథ. ఈ దేశంలో సగటు మనిషి పడే ఇబ్బందుల్ని, తినే ఎదురుదెబ్బల్ని నేనూ అనుభవించాను.

చాలా కాలం దాకా నాలో ఒక కోరిక మాత్రం నిలిచిపోయింది. మా వూళ్ళో పదంకణాల చిన్న పెంకుటిల్లయినా కొనుక్కోవాలని. నేను పుట్టింది నెల్లూరులో. నాకు ఆరేళ్ళునిండేదాకా మూలాపేట రాజాగారి వీధిలోనే పెరిగాను. చెరువుకట్ట మీద అమ్మవారి గుడి. చుట్టూ పచ్చని పంటచేలు. దూరంగా కనిపించే నరసింహకొండ. ఇంకా ముందుకి నడిస్తే జొన్నవాడకి పొయ్యేదారి. పెన్నానది దాటి పడవలో కామాక్షమ్మ గుడికి వెళ్ళడం. తడిసిన బట్టల్లో వొంపు సొంపులన్నీ ప్రదర్శిస్తూ అమ్మోరి గుడి చుట్టూ ప్రదక్షిణం చేసే ఆడపడుచుల అందచందాలు - అదంతా నాకిప్పటికీ బాగా గుర్తు.నాకు ఇద్దరాడపిల్లలు పుట్టేదాకా కూడా నాలోని ఆ కోరికని పెంచి ప్రోదిచేస్తూనే వచ్చాను. మూడో సంతానం కూడా అమ్మాయే అయ్యేసరికి ఇక నా కోరికని సమాధి చేసేశాను. అయినా అది అప్పుడప్పుడూ పునర్జన్మ ఎత్తుతూనే వుంది.

పెద్దమ్మాయికి పెళ్ళి చేశాను. రెండవ అమ్మాయికి చదువు పూర్తయింది. కడగొట్టది ఇంకా హైస్కూలు దాటలేదు.ఇంకో రెండు మూడేళ్ళకి వాలంటరీ రిటైర్మెంటు తీసేసుకుని వచ్చే ఆ ప్రావిడెంటు ఫండులోంచి కొంతడబ్బుతో జొన్నాడలో చిన్న స్థలమైనా సరే కొనుక్కుని, పర్ణశాలలాంటి పూరి గుడిసైనా వేసుకుని రోజూ పెన్నగాలిని పీలుస్తూ, నరసింహకొండకి కాలి నడకనే వెళ్ళి వస్తూ శేషజీవితమంతా గడిపేయాలనే కోరిక లోపల్నించి తన్నుకుని వస్తూనే వుంటుంది. కాని సాగనిచ్చేలా లేదు కట్టుకున్న ఆడది, కన్నబిడ్డలు. జీవితాంతం చాకిరీ చేసి పోషించాల్సింది పోయి అంతలోనే తెంచుకుని ఎగిరిపోవాలనుకుంటున్నావా అన్నట్టుగా సంసార పంజరంలో బంధించి పెట్టేశారు నన్ను. వాళ్ళకేం? నాలాగా రోజుకి అరవై కిలోమీటర్లు ఈ లోకల్ ట్రైన్సులోనే కాలం వెళ్ళబుచ్చుతున్నాం ఏమిటి. జీవితంలో నేనెన్నింటినో సహించి భరించగలిగానేగాని మూడు దశాబ్దాలు దాటినా ఈ సబర్బన్ ట్రైన్ జర్నీ మాత్రం నాకింకా దుర్భరంగానే అనిపిస్తున్నది. నాతో బాటు రోజూ రైల్లో ప్రయాణం చేసే వాళ్ళని చూస్తుంటే నాకు అసూయగా వుంటుంది. ఎంత సరదాగా వుంటారో వాళ్ళంతా. స్టేషన్ వచ్చే సంగతికూడా గమనించని స్థితిలో రమ్మీ ఆటలో మైమరచిపోయే వాళ్ళు, రాజకీయాల చర్చల్లో తేలియాడేవాళ్ళు. ఆవడిలో ఎక్కి చెవి కానించుకున్న ట్రాన్సిస్టర్‌ని సెంట్రల్ వచ్చే దాకా దించని క్రికెట్ ప్రియులు. 'ఈ మాయమయ ప్రపంచంతో నాకేమిటి పని. నేను దిగే స్టేషన్ వచ్చే దాకా నాకు నేనే రాజుని' అన్నట్టుగా కళ్ళు మూసుకుని యోగ నిద్రలోకి వెళ్ళిపోయే చిదానంద స్వరూపులు -ఇలా రక రకాల కమ్యూటర్లని నిత్య



# గాలివాన

-జి.సి.జేపి

ఆంధ్రవాహిని (అట్టావా) నిర్వహించిన 1988 శ్రీరామనవమి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ.

తరబడి చూస్తున్నా వాళ్ళు చేసుకున్న పుణ్యంలో వెయ్యోవంతు కూడా నాకు దక్కలేదే.

"రెండేళ్ళ ఈ రైలు ప్రయాణంలో తెలుగు నవలా సాహిత్యమంతా చదివేసాను. రిటైరయ్యేలోగా ప్రపంచ సాహిత్యాన్నంతా కూడా ఈ ట్రైన్ జర్నీలోనే ఔపోసన పట్టేయగల్ను" అంటాడు నాతోబాటే చిన్నమ్నారులో ఎక్కి పెరంబూరులో దిగిపోయే బడిపంతులు.

"మసాలా పాప్‌కార్న్. రెండుపాకెట్ ఒక్రషబా.ఒన్ను ఎట్టనా"-

"సపోటా.అంజిఒక్రుబా. తిత్రిప్పిముదాదుడ్డు. ఇల్లేన్నా కాసు వాపస్"-

"సింగపూర్ బాల్‌పేనా సర్. టు ఇన్ వన్. ఇదపక్కం బులు. ఇందపక్కం రెడ్. ఒరే రూబా"-

"లేడిస్ అండ్ జంటిల్మెన్! యువర్ అటెన్షన్ ప్లీస్. అయాం లైక్ యువర్ ఫాదర్. ప్లీస్ హెల్ప్ మి టు హేవ్ ఎ స్క్వేర్‌మీల్సు టు డే. గాడ్ విల్ హెల్ప్‌యు. టెన్ పైసే, ట్వంటి. ఫిఫ్టీ ఎనిథింగ్ యులైక్" అనే మాటలు మాత్రం నేర్చుకున్న సివిలైజ్డు బెగ్గర్. ఇన్ని రణగొణ ధ్వనుల నడుమ పేపర్ చదవడమే సాధ్యం కానినా దృష్టిలో విశ్వ సాహిత్యమంతా చదివేయగలననే ఆ బడిపంతులు నిజంగా మహాత్ముడే.

ఇవన్నీ చాలవన్నట్టుగా నెల్రోజులుగా మరో ఆపదలో చిక్కుకున్నాను నేను.

ఆ అమ్మాయికి పదేళ్ళుంటాయేమో. తెలుగు పాపే. చింపిరి తల, తైలసంస్కారం లేని జుత్తు, చిరుగుల గౌను, పీక్కుపోయిన దవడలు అదంతావెనకటితరం ట్రైన్ బిచ్చగత్తెల సంగతి.ఈ పాపని అలా వూహించు కుంటే పాపం చుట్టుకుంటుంది. బిచ్చమెత్తుకునే వాళ్ళు చింపిరి బట్టలే వేసుకోవాలనే రూలుందా ఏమిటి? ఈ పాప చక్కగా తల దువ్వుకుని జడేసుకుంటుంది.రోజుకో రంగు రిబ్బను పెట్టుకుంటుంది. మా ఆఖరి అమ్మాయి కూడా కొనివ్వలేదు. నేను అన్ని రకాల రిబ్బన్లు, శుభ్రంగా వుతికిన బట్టలేసుకుంటుంది. ముఖం కూడా కళగానే వుంటుంది.ఆ పిల్ల బిచ్చమెత్తుకో కూడదని నేననడంలేదు. అడుక్కోవడం మన ఫండమెంటల్ రైట్. కాదనడానికి నేనెవర్ని? అయితే నా అభ్యంతర మల్లా, ఆ భగవంతునికి నా అభ్యర్థన అంతా ఆ పిల్లపాడే పాట నా చెవుల్లో పడకుండా వుండాలనే. ఇంతకీ అదిచాలా మంచిపాటే. రేడియోలో చాలాసార్లు విని వున్నాను. అడుక్కునే వాళ్ళు పాటలు పాడకూడదని నేన్ను. ఉత్తనే డబ్బులిమ్మనడం కన్న కొంత వినోదం అందించి పైసలడగడం మంచిదే. నాకింకా బాగా గుర్తు.కొన్నేళ్ళ కిందట దాదాపు ఈ ఈడు పిల్లే ఒకమ్మాయి అంబెత్తురులో ఎక్కేది.

అందమే ఆనందం

ఆనందమే జీవితమకరందం... అని ఎంతో కమ్మగా పాడేది. ఏ మ్యూజిక్‌డైరెక్టర్ చెవిలో పడి వున్నా ఆ అమ్మడు ఈపాటికి ప్లేబాక్ సింగర్ అయివుండేది. అంత శ్రావ్యంగా వుంటుంది ఆ పిల్లగొంతు. బిచ్చగాళ్ళని ప్రోత్సహించరాదనే నా పాలసీని కూడా కొంచెం సడలించి ఆ పాపకి పదిపైసలో ఇరవై పైసలో ఇచ్చేవాడిని.

ఇంతకీ ఇప్పుడు నీ కొంపేం మునిగిపోయింది అంటారా? ఇప్పుడు నాకొచ్చిపడిన ఆపద ఆ రంగు రిబ్బన్ల పాప కాదు. ఆమె పాడే పాట కాదు.అది బూతు పాటేమీ కాదు.మంచి తత్వ చింతనతో కూడిన పాటే అది.అయితే ఆ పిల్ల గొంతు, ఆ పాడే విధానం -ఇదే నాకు భరింపరానిదిగా తయారైంది. పెట్టెలోకి ఆ పిల్ల ఎక్కిందంటే చాలు నా గుండెలు దడ దడలాడేవి.

"గాలి వానలో వాననీటిలో
పడవ ప్రయాణం
తీరమెక్కడో గమ్యమేమిటో తెలియదుపాపం"-

అది మగగొంతూ కాదు, ఆడగొంతూ కాదు. రెండూ కలిసిన అదేదో వికృత కంఠస్వరం. అంత అందమైన పాపలో ఇంత కఠోరమైన కంఠస్వరాన్ని ఎందుకు సృష్టించాడో ఆ దేవుడు? అప్పటికే ఒక్కోసారి చెవుల్లో ఏదో కలియబెట్టుకుంటున్నట్టు నటిస్తూ చెవులు రెండూ మూసుకునే వాడ్ని ఎవరూ చూడకుండా. అయినా నా కర్ణ పుటాలని ఛేదించుకుని వెళ్ళేది ఆ పాట. దిగిపోయి వేరే కంపార్టుమెంటులో ఎక్కుదామా అంటే మళ్ళీసెంట్రల్ దాకా కూర్చునే దానికి సీటు దొరకదాయె. అంచేత ఆ అమ్మాయిని తప్పించుకోడానికి రోజూ ఎక్కే కంపార్టుమెంటు గాక. రోజుకో పెట్టెలో ఎక్కేవాడిని.

> ### సాధారణంగా
>
> "ఒకవేళ నీ ప్రేమను నేను తిరస్కరిస్తే నిజంగా ఆత్మహత్య చేసుకుంటావా? మోహన్" జాలిగా అడిగింది రాధ.
>
> "అవును. సాధారణంగా అలాగే చేస్తుంటాను, రాధా" దిగులుగా చెప్పాడు మోహన్.
>
> — కె.వి.ఎం.ఆర్ (కాకినాడ)

పూర్వజన్మలో నేనేదో పాపం చేసుకుని వుండాలి. లేక ఆ రిబ్బన్ల పాపకి దివ్యదృష్టి లాంటిదేదో వుండాలి. కాకపోతే నేను ఏ పెట్టెలోకి ఎక్కినా సరిగ్గా అక్కడే ఆ అమ్మాయి ప్రత్యక్షం కావడమేమిటి!

'గాలివానలో వాననీటిలో'- ఎత్తుకుందంటే అలా సాగిపోతూ వుండాల్సిందే. ఒక్కోసారి నాకేమనిపించేదంటే ఆ గాలివాన అప్పుడే వచ్చి ఆ కంపార్టుమెంటంతా కొట్టుకుపోతే పీడా విరగడవుతుంది కదా అని. ఒకసారి ఇక భరించడం నా శక్యంగాక పెరంబూరులో దిగేసి గబగబా రెండు పెట్టెల వెనక్కి వెళ్ళి ఒక దాంట్లో ఎక్కేశాను. విల్లివాక్కంలో అదే కంపార్టుమెంటులో ప్రత్యక్షమైంది ఆ పిల్ల. సందేహం లేదు. ఏ దేవుడో నా మీద కక్ష గట్టి వుండాల. లేదా ఏ దుష్టశక్తో నన్ను వెంటాడుతూ వుండాలి. ఇట్లా కాదనుకుని రోజూ వెళ్ళే ట్రైన్ కాకుండా ఆతరువాత పదిహేను నిమిషాలకి బైలుదేరే 'అరక్కోణం' లోకల్‌లో రావడం ప్రారంభించాను. ఉహూ... లాభం లేదు. నీ ఎత్తులు నా దగ్గరా?" అన్నట్టుగా ఆ అమ్మడు అదే రైల్లో అదే పెట్టెలోనే ఎక్కేది.

ఆరోజు...

ఆఫీసులో మేనేజర్‌తో చిన్నగొడవ. మనసంతా చికాగ్గా వుంది. తప్పు నాదా లేక డిస్పాచి క్లార్కుదా అని తేల్చుకోవాలని. దానికి తగినట్టుగా రేపు రాతపూర్వకంగా సంజాయిషీ ఇచ్చుకోవాలి. ఆలోచిస్తూ కూర్చున్నాను కిటికీ పక్కనే. ఉన్నట్టుండి పిడుగులు పడినట్టుగా 'గాలివానలో వాన నీటిలో' వినిపించింది. నాకా క్షణంలో నిజంగా జీవితం మీదే రోత పుట్టింది. అక్కడికక్కడే సీలింగ్ ఫాను గాని వుంటే వురేసుకోవాలనిపించింది.

"చూడమ్మా! ఇలారా" అని పిలిచాను ఆ పాపని. నాకేసి ఆదరకంగా చూస్తూ దగ్గరగా వచ్చింది.

'తీరమెక్కడో గమ్యమేమిటో
తెలియదు పాపం - పాడుతూనే వుంది.

జేబులోంచి రూపాయి బిళ్ళ తీశాను.

"చూడు. నేను పెరంబూరులో దిగిపోతాను గాని, ఈ రూపాయి తీసుకుని అందాకా ఆ పాటని ఆపమ్మా" అంటూ ఆ పిల్లచేతిలో రూపాయి బిళ్ళ వుంచాను. పాట ఆగిపోయింది. మౌనంగా నన్ను - రూపాయి బిళ్ళని మార్చి మార్చి చూసింది. నా రూపాయిని నా చేతికే తిరిగిచ్చేసింది.

"గాలివానలో వాననీటిలో..." మరింత బిగ్గరగా పాడుకుంటూ వెనక్కి తిరిగింది.

ఆ కంపార్టుమెంటులో ఎంతమంది నాకేసి ఏ రకంగా చూసి నవ్వుకున్నారో నాకు తెలీదు. గట్టిగా కళ్ళు మూసుకుని సీట్లో వెనక్కి చేరగిలబడ్డాను. ●

